# మనోవాహిని

రచన: జి. వి. యల్. యన్. ఆచార్య




“దురాశ దుఃఖానికి చేటు” “నన్ను ఆశపెట్టావు—నీకు కంటికాయ పుడుతుందిలే” ఇలాంటిమాటలు మన చిన్న పిల్లలు అనుకుంటూంటే వింటూనేవుంటాం. వాళ్ళకెవరు చెప్పారు! నిజంగా వాటి అర్థం వాళ్ళకు తెలుసా! అని మనం చర్చించుకుంటే — వాళ్ళదాకా ఎందుకు అసలు మనకే తెలీదు — అని చెప్పాల్సి వస్తుంది. వాస్తవికంకూడా అంతేనేమో! చెప్పడం సులువు చెయ్యడం కష్టం. ఐతే చెయ్యడంతో సంబంధంలేదు. ఎవరేనా ఒక మంచిమాట చెపితే చెయ్యాలి. అది చెప్పినవారు ఎంతవఱకూ దాన్ని అమల్లో పెట్టారా? అనేది మనకు అనవసరం. అది వాళ్ల బాధ్యత. ఇదే గాంధిగారి సిద్ధాంతం. ఆయన, తనుచేసినపని చెయ్యక్కరలేదన్నారు. చెప్పినపనిచేస్తే మంచిదన్నారు. నిజంగా బాగుపడదలచుకున్నవారు ఆ సూత్రాన్నే పాటిస్తారు. విమర్శకులకు విమర్శే శరణ్యం.

“మోహం” అనునది మన ఐదవశత్రువని అందరికీ తెలిసిన విషయమని ఒప్పుకోక తప్పదు. కాని ప్రకృతిప్రభావము. అందులోనేపడి మనమంతా భ్రమిస్తుంటాము. ఎత్తెత్తి ఎంగిలాకుమీద అడుగేసినట్టు దేనిగురించి మనం ఎక్కువగా భయపడుతుంటామో దానిగురించే అనుక్షణము ఆలోచిస్తూ అంటిపెట్టుకునివుంటాం. ఐతే అందునుండి తప్పుకోవడం అసాధ్యమైన విషయం. మరెందుకి ఆలోచన యీ బాధ. హాయిగా ఊరుకోక అనుకుంటే — జీవితంలో మనం పొందలేనటువంటి విషయాలకోసంకూడా ఆశపడుతూంటాం. ఆ ఆశలో ఇదో ఆశ ‘ఏమో తేలగలమేమో!’ అనే భ్రమ.

మోహాన్ని ఆశగా అనువదించి తేలికగా పిలుద్దాం. ఆశలేకుంటె జీవితం నిర్జీవము అయిపోతుంది. ఆనందం, అనుభూతి వగైరాలు మర్చిపోవలసిందే. ఇక మిగిలేది యేముంది శూన్యం. ఇదంతా అమల్లోకొస్తే మనకిక యిళ్ళూ, వాకిళ్ళూ అనవసరం. యోగాశ్రమానికి పునాదులేసుకోవలసిందే. ఈ మోహబంధం లేకుంటే జీవులమధ్య జీవత్వం నశిస్తుంది. దయ, ప్రేమ, ఓర్పు యిలాంటివాటికి తావుండదు. ఈ బంధమే మనల్ని ఇటువంటి శక్తివంతంగా కట్టి నడిపిస్తూంది. దానికి మనం జోహార్లుచేయవలసిందే.

ఆశ ఉన్నప్పుడు ఫలితానికి సంతృప్తి అనేదికూడా వుండాలి. దీనికి కూడా ఒక పరిమితి అంటూ వుంది. ఎలుకకు, తను పిల్లినవాలని ఆశ—పిల్లికి తను కుక్కనవాలనే ఆశ, కుక్కకు తను గుర్రాన్నవాలనే ఆశ. మరి గుర్రానికి తను రౌతునవాలనే ఆశ—ఎందుకు? ఆ రూపాల్లోనున్న తమ శత్రువులతో దెబ్బలాడడానికి తగిన శక్తిని పొందేందుకు. ఈ ఆశలు సాధ్యమా! న్యాయసమ్మతమా? ఎంతవరకూ సమంజసమొ! ఎంతవఱకూ ఫలిస్తాయి? అనే ప్రశ్నలు అప్రస్తుతము. కారణమేమిటంటే! అలాంటి జాతికిచెందిన ఆశలు సఫలీకృతమూ కాలేవు — కాకూడదనే మన ఆశ.

అసలు ఆశ అనేది అసందర్భమేకదా! దాంట్లో యిన్నిరకాలు, న్యాయసమ్మతమా! వగైరాలు ఉంటాయా? అనే క్రొత్తసమస్య ఎదురవుతుంది. ఆలోచించవలసిందే. ఆకలిగా ఉన్నవాడికి అన్నం తినాలని ఆశ! దాహంగా ఉంటే నీళ్లు త్రాగాలని ఆశ! చలివేస్తే కప్పుకోవాలని ఆశ! దెబ్బ తగులుతే మందు పెట్టుకోవాలని ఆశ! ఇటువంటి—జరిగే సూచనలు గలవి—ప్రతీ జీవీ కోరుకునే కనీసపు కోరికలు జరగాలనీ, ఫలోన్ముఖులవాలనే ఆశిద్దాం.

వీటిలోనే అసందర్భమైన కోరికలు కూడా ఉండొచ్చు. ఉదాహరణకు పైవాటినే తీసుకుందాం. ఆకలి వేస్తుంది అన్నంవడ్డిస్తారు, కాని తినరు. వారికో ఆశ వుంది. ఒక చక్కని అమ్మాయి బంగారు పళ్లెంలో పంచ భక్ష్యపరమాన్నాలతోసహా వడ్డించి తను టూగుటుయ్యాలలో కూర్చునివుండగా, చేతిగాజులు గల్లుమని శబ్దం చేసుకుంటూ తనకు తినిపించాలి. ఆ చేత్తోనే మంచినీళ్లుత్రాగించాలి. సామాన్య సంసారిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే, ఈ ఆశ ఎంత అవకతవకయినదో వేరే చెప్పక్కరలేదు. ఓ మంచి కాశీమజిలీకథ చదివి గట్టిగా కళ్లుమూసుకుని, అలాంటి కల రావాలని దేముడ్ని ప్రొక్కుకోవడమే గత్యంతరము. ఆ కలకూడా రాకుంటే, (రాదు) పోనీ, ఆలోచనేనా

వచ్చినందుకు తమల్ని తాము అభినందించుకోవచ్చు.

ఆశను పొందేముందు, అది ఎంత వరకూ ఫలిస్తుంది అని ఆలోచించి మరీ ప్రయత్నించడం మంచిది. ఒకవేళ ఫలించేబగులు ఫలించక పోవడానికి హెచ్చు అవకాశాలుంటే, ఆశను వదులుకోవాలి. అందులో ఏవిధమైన అవమానం లేదు. అసలదే క్షేమకరం. నిరర్ధకంగా ఆశను పెట్టుకుని కూర్చుని, అది ఫలించనప్పుడు విచారించి ప్రయోజనం వుండదు; చాలా అవస్థలు కలుగుతాయి. కలిగే ఆశ దురాశ కాకూడదు. న్యాయమయినదిగా వుండాలి. అప్పుడే అనందాన్ని పొందగలుగుతాం.

ఆనందాన్ని అనుభవించడం మన స్తత్వాన్నిబట్టి వుంటుంది. సంతృప్తి ఎక్కడుంటుందో అక్కడే ఆనందం వుంటుంది. అది లోపించినప్పుడు ఏ జీవి కూడా సుఖించలేడు. అసంతృప్తి అనేక అనర్థాలకు దారితీస్తుంది. మనం సంఘంలో మంచిగాకాని, చెడ్డగాకాని పరిగణించబడుటకు, యిదే చాలావఱకు ముఖ్యకారణము.

రెండు ఉదాహరణలు దీన్ని నిరూపిస్తాయి. ఒక ధనవంతుణ్ణి, ఒక పేదవాణ్ణి తీసుకుందాం. మొదటివాడు ఎంత ఎక్కువగా డబ్బు సంపాదించగలుగుతే. సంఘములో అంత పేరుప్రతిష్ఠలొస్తాయని దురభిప్రాయంతో, ఒకవ్యాపారంగాని, పరిశ్రమకాని ప్రారంభిస్తాడు. తన సాధనలో ఎన్ని కర్మకాండలు జరిగినా తను లెక్కచేయడు. తనకు కావలసినది డబ్బు అంతే దీనికి మూలకారణం. తనకు యిదివఱకున్న ధనంతో సంతృప్తిలేక యీ అవస్థపడవలసి వచ్చింది. ఈ విధానము ఎంత నష్టదాయకమో ఆలోచించవలసిందే.

కాని పేదవానిసంగతి అదికాదు. తను చేయగలిగిన కాయకష్టం చేసుకుంటాడు. వచ్చిన ప్రతిఫలం ఏదో రానేవస్తుంది. హాయిగా అనుభవిస్తాడు, సుఖిస్తాడు. తను హెచ్చుగా కావాలని కోరడు. కారణం కోరినా రాదని తనకు తెలును. ఆ పూటకు సరిపోయేది కోరుకుంటాడు. దానితో సంతృప్తిపొందుతాడు. అందులోనే ఆనందము దొరుకుతుంది.

ఈ రెండు సంఘటనల్లోనూ; ఒక విధముగా ఆలోచిస్తే ధనవంతుడని మనం పిలిచిన వాడే సంతృప్తిలేని పేదవాడని, పేదవాడని మనం పిలిచినవాడు, ధనం లేకపోయినా, నిండయిన సంతృప్తిగల ధనికుడని తేలుతుంది.

నిత్యజీవితంలో మనకు అనేక ఆశలు కోరికలు ఉంటాయి సహజమే. అసలు అటువంటిది లేకుంటే మనకు ఉత్సాహం కలుగదు. మనభవిష్యత్తు చీకటిమయంగా కనిపిస్తుంటుంది. కాని అందని ఆశలను పెట్టుకుని జీవితంలో గాలిమేడలు కట్టుకుంటే కూలిపోయే అవకాశాలు హెచ్చు. రూపాయిలాటరీకట్టి నాకో లక్షవస్తే నీకు వెయ్యిస్తానని దేముడ్ని లాటరీ కట్టిన ప్రముఖులందరూ మొక్కుకుంటే, ఎంత మందికి వస్తుంది. ఒక రూపాయితో లక్ష రావాలనుకోవడం దురాశకాదూ! అయితే కొంతమందికి వస్తున్నాయి — అదే ఆశకు కారణం. అది వేరే విషయం. అవసరమైనవి, అందరానివి ఆశలుపెట్టుకుని, కల్పించుకుని. అవి ఫలించనప్పుడు జీవితాన్ని దుర్భరంగా మార్చుకునేకంటే, అందుబాటులో ఉన్నవాటిని సద్వినియోగముచేసుకుని సంతృప్తిని పొందగలిగితే జన్మధన్యమయినట్టే! తాము ఆనందం పొంది మరొకనికి ఆనందాన్ని యివ్వగలరు! అదేకదా మన జీవితపరమావధి

★


# సిఫిలినో

దీని సేవవలన తీరునట్టి వ్యాధులు మేహ పొడలు, మేహ వ్రణం, మేహ వాయువు, మేహ జ్వరం, నలుపు, తెలుపు, ఎరుపు, మేహములు, గ్రంధి, తీట, గుంటపుండ్లు, నయముకాని వ్రణములు, కంఠమాల, తొడలో కలుగునట్టి అరటి పూవువంటి గడ్డలు, తామర, తిమ్మిర వాయువు, మేహ పగుళ్లు, శుక్ల మూత్రము, మధుమేహము ఇటువంటి సకల వ్యాధులను గ్యారంటీగా గుణపరచును. స్త్రీ పురుషులు వాడవచ్చును.

20 పూటలమందు రూ. 3=50 న పై.

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నెం. 1376, మద్రాసు-1.


